సింగిల్ పేజీ కథ

# బడిగంట

ఎ. రజాహుస్సేన్



యాభైయ్యేళ్లనాటి మాట..

ఆ రోజుల్లో ఇప్పటిలాగా హైటెక్ సౌకర్యాలు లేవు. మా ఊరు అవటానికి పంచాయితీయే అయినా మారుమూల విసిరేసినట్టుండేది. మొత్తం అయిదొందల ఇళ్లు. అప్పుడే పంచాయితీ ఎన్నికలు జరిగి కొత్త పంచాయితీ సర్పంచ్ హనీఫ్ ఎన్నికయ్యాడు. ఆయన డబ్బున్న వాడు కావటంతో పంచాయితీ నిధులతో సంబంధం లేకుండా సొంత డబ్బుతో మా ఊర్లో ఓ బడి తెరిపించాడు. పూరిపాకలో మొత్తం రెండు తరగతులుండేవి. పంచాయితీ తరపున ఇద్దరు టీచర్లను అపాయింట్ చేశాడు. అంతా బాగానే వుంది కాని చదువుకోటానికి పిల్లలు మాత్రం లేరు. రాక రాక మా ఊరికి బడొస్తే పిల్లలు లేకపోవడంతో ప్రారంభానికి ముందే బడి మూత పడే పరిస్థితి ఏర్పడింది. దీంతో మా సర్పంచ్ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పిల్లల్ని బలవంతంగా లాక్కొచ్చి బడిలో చేర్పించాడు. సర్పంచ్ ఇంటికి వస్తున్నాడని తెలిసి మేం దాక్కునేవాళ్లం. మాకు అప్పట్లో బడి అంటే భయంగా వుండేది. బడికెళ్తే ఇక ఆడుకోవడం కుదరదని మా బాబిగాడు చెప్పే మాటల్ని మేమంతా నమ్మేవాళ్లం. అయితే మా సర్పంచ్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలాగా మమ్మల్ని వదిలిపెట్టలేదు. క్రమంగా బడిలో పిల్లల సంఖ్య ముప్పైకి చేరింది. ఓ శుభముహూర్తాన సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి బడీని ప్రారంభించాడు. ఆ రోజు నుండి బడి మా జీవితాల్లో ప్రధానమైపోయింది.

తెల్లారితే చాలు... గణ... గణ... గణ... మంటూ బడి గంట మా ఊరికే గడియారమయ్యేది. మొదటి గంట మోగిందంటే ఉదయం ఎనిమిది గంటలైనట్లు లెక్క. రెండో గంట ఎనిమిదింపావుకు, మూడో గంట కొడితే ఎనిమిదిన్నర.. అప్పుడే బడి మొదలవుతుంది. ఇక అప్పటి నుంచి గంట గంటకూ ఓ గంట మోగుతుంది. పన్నెండు గంటలైతే మళ్లీ గణ.. గణ.. గణమంటూ హోంబెల్... మళ్లీ మధ్యాహ్నం రెండు గంటలకు బడిగంట మోగుతుంది... సాయంత్రం అయిదు గంటలకు హోంబెల్.. ఇదీ మా బడి దినచర్య. దీన్ని బడి దినచర్య అనేకంటే మా ఊరి దినచర్య అంటే బాగుంటుందేమో.. బడిగంటతో మా ఊర్లోని బతుకులు కూడా మారిపోయాయి. బడి గంటల్ని బట్టి మా ఊర్లో జనం పనిపాటలకు సమయం నిర్ధారించు కునేవారు. కలుపుకెళ్లే కూలీలు మొదటి గంటకే బయలుదేరి పొలాల కెళ్లేవారు. ఉద్యోగస్తులు రెండోగంటనుంచే స్నానపానాదులు ముగించు కొని సిద్ధమయ్యేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే బడిగంట లేకపోతే మా ఊరే లేదు.

ఆదివారమో లేక పండగ పబ్బాల సెలవు రోజుల్లోనో బడిగంట మోగనప్పుడు మా ఊరు మూగబోయేది. బడిగంట చెవినబడకపోతే మా ఊరి జనానికి ఏం తోచేదికాదు. మరుసటిరోజు తిరిగి బడిగంట వినబడగానే ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొచ్చేది. బడిగంట ఇంత ఠంచన్‌గా మోగటానికి మా సుబ్బిగాడు కారణం. బడిగంట కొట్టడానికి నెలకు 12 రూపాయలకు సుబ్బిగాడ్ని నియమించాడు సర్పంచ్. సుబ్బిగాడికి నా అనేవాళ్లు ఎవరూ లేకపోవటంతో బడి పాకలోనే ఓ మూల వండుకు తిని పడుండేవాడు. అప్పుడప్పుడూ మా ఇళ్లల్లో వండిన పిండివంటల్ని కాగితంలో చుట్టి దొంగతనంగా తెచ్చి సుబ్బిగాడికిచ్చేవాళ్లం. తీరిక సమయాల్లో సుబ్బిగాడితో మేమంతా ఆడుకునేవాళ్లం. ఇంటర్వెల్‌లో సుబ్బి.. సుబ్బి అంటూ ఆటపట్టించేవాళ్లం. మేం ఎంత అల్లరిచేసినా సుబ్బిగాడు మాత్రం కోపగించుకునే వాడు కాదు. మా పుస్తకాలకు అట్టలు కూడా వేసి పెట్టేవాడు. మాకు ఒక్కొక్కరికి ఒక్క బెస్ట్ ఫ్రెండ్ వుంటే, సుబ్బిగాడు మాత్రం బడి పిల్లలందరికీ బెస్ట్‌ఫ్రెండ్. మా బడి రోజులు హాయిగా గడిచిపోయేవి.

ఉన్నట్టుండి ఓ రోజు బడిగంట మోగలేదు. ఆ రోజు బడికి సెలవేమీ లేదు. అప్పటికే ఎనిమిదిన్నర దాటిపోయింది. బడిగంటకోసం ఊరు ఊరంతా ఎదురుచూసింది. పంతుళ్లు, మేమూ సుబ్బిగాడికోసం వెతికాము. బడి వెనక సుబ్బిగాడు స్పృహలేకుండా పడివున్నాడు. వాడి చేతిలో గంట వుంది. ఊర్లో వాళ్లంతా వచ్చి విచారించారు. మా ఊర్లోని ఆర్.ఎం.పీ. డాక్టర్ వచ్చి నాడి చూశాడు. గుండెపోటు ప్చ్.. అంటూ పెదవి విరిచాడు. ఊళ్లో వాళ్లంతా కలిసి సుబ్బిగాడి అంత్యక్రియలు చేశారు.

ఆ మరుసటి రోజు నుంచి బడిగంట మోగితే సుబ్బిగాడు గుర్తుకొచ్చి మా కళ్లల్లో నీళ్లు తిరిగేవి. గంట మోగినప్పుడల్లా మా లేత గుండెలపై సమ్మెట దెబ్బలా అనిపించేది. అందుకే ఓ రాత్రి మేమంతా బడి గంటను ఊడదీసి పక్కనే వున్న పాడుబడ్డ బావిలో పడేశాం. ఆ తర్వాత పంచాయితీ వాళ్లు మరో గంటను తెచ్చి కట్టారు. దాన్నిగూడ ఊడబెరికి బావిలో పడేశాం. ఇక లాభం లేదని పంచాయితీ వాళ్లు సైరన్‌ను బిగించారు.

అప్పటి నుండి సైరన్ కూతతోనే బడి మొదలయ్యేది. సెలవుల్లో ఊరెళ్లి మా బడిని చూసిన ప్పుడు సుబ్బిగాడు ఇంకా గంట కొడుతుంటే ఆ శబ్దం మా చెవుల్లో ఇంకా మార్మోగుతున్నట్లనిపిస్తుంది. •

